



విలేకరులతో మాట్లాడుతున్న చిన్నారెడ్డి



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి; చిత్రంలో కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకి

పాలమూరుపై.. ఫోకస్



సీఎం రేవంత్‌రెడ్డి

- ఇరిగేషన్, విద్య, వైద్యం, టూరిజంపై నేడు సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- పీఆర్ఎల్ఐ, పెండింగ్ ఎత్తిపోతల పథకాల సత్వర పూర్తికి సన్నాహాలు
- భీమా రెండు దశలు, పీఆర్ఎల్ఐ ప్రాజెక్టులో ఆర్అండ్ఆర్ సమస్యలు
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో కాలువల నిర్మాణానికి పడని అడుగులు
- కేఎల్ఐలో కొత్త రిజర్వాయర్ల నిర్మాణం.. నిల్వ సామర్థ్యం పెంపుపై దృష్టి
- సఫారీ టూరిజం, నీట్, స్కిల్ సెంటర్లు, పారిశ్రామిక అభివృద్ధిపైనా చర్చ

మహబూబ్‌నగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్ అభివృద్ధిపై దృష్టి సారించారు. అందులో భాగంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్య రంగాల్లో పనుల పురోగతి, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, కావాల్సిన నిధులపై మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ప్రధానంగా ఇరిగేషన్, విద్య, వైద్యం, టూరిజం, మహిళా సంఘాల స్వయం సమృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. సీఎం సమీక్ష నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులతో ఆదివారం మహబూబ్‌నగర్‌లో సమావేశం నిర్వహించారు. కావాల్సిన వివరాలు, తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర ప్రణాళికతో రావాలని అధికారులను ఆదేశించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ప్రభుత్వ కార్యక్రమాల పరంగా సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఫిబ్రవరిలో పర్యటించారు. రూ.4,369.143 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రధానంగా మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయడంతో పాటు.. ప్రభుత్వ ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో ప్రభుత్వ కార్యక్రమాల కోసం మహబూబ్‌నగర్‌కు రావడం ఇదే మొదటిసారి. దీంతో పాలమూరు అభివృద్ధిపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తితోపాటు.. మహబూబ్‌నగర్‌కు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కావాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరుతున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు, జాతీయ రహదారిని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడం, నల్లమలలో సఫారీ టూరిజం, మండలానికి ఒక రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు, వంద పడకల ఆస్పత్రుల్లో వసతులు, పీహెచ్‌సీల బలోపేతం, మహిళా సంఘాలకు చేయూత వంటి వాటిని మిగతా ఎమ్మెల్యేలు విన్నవిస్తున్నారు. పలు కీలక నిర్ణయాలతో పాటు కొత్త అభివృద్ధి పనులకు నిధుల మంజూరుపై సీఎం పర్యటనలో సమీక్షించనున్నట్లు తెలుస్తోంది.

పీఆర్ఎల్ఐపై ప్రధాన చర్చ..

ఉమ్మడి పాలమూరు జిల్లాతోపాటు రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, 1,200 పైచిలుకు గ్రామాలకు తాగు నీరు అందించే ఉద్దేశంతో చేపట్టిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై సమీక్షలో ప్రధానంగా చర్చించనున్నారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ సోర్స్‌గా ఐదు లిఫ్టులు, ఆరు రిజర్వాయర్లతో 2015లో ఈ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. మొత్తం రూ.35,200 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించగా.. రోజుకు 1.5 టీఎంసీల చొప్పున 60 రోజులపాటు 90 టీఎంసీల నీటిని తరలించడం ద్వారా ఆయకట్టుకు నీరందించాలని నిర్ణయించారు. తర్వాత దీని అంచనాలను రూ.55,086 కోట్లకు పెంచారు. పర్యావరణ, ప్రాజెక్టు అనుమతుల విషయంలో కోర్టు కేసులు నడిచాయి. అయితే ఎన్నికలకు ముందు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్భాటంగా మొదటి లిఫ్టు వద్ద ఒక్క పంపును ప్రారంభించారు. రూ.27,553 కోట్లు ఖర్చు చేయగా ఏదుల రిజర్వాయర్ వరకు చెప్పుకోదగ్గ పనులు జరిగాయి. మిగతా ఆయకట్టుకు సంబంధించిన రిజర్వాయర్ల కాలువల నిర్మాణం కోసం భూసేకరణ కూడా జరగలేదు. ఉదండాపూర్‌తోపాటు మిగతా రిజర్వాయర్ల వద్ద ఆర్అండ్ఆర్ సమస్యలు ఉన్నాయి. ప్రస్తుతం నారాయణపేట, కొడంగల్, మక్తల్ ప్రాంతాలకు నీరిందించడానికి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టగా.. ఆ మేరకు పీఆర్ఎల్ఐని కూడా మళ్లీ రీడిజైన్ చేస్తారనే చర్చ జరుగుతోంది. ప్రాజెక్టు ప్రారంభించినప్పటి రేట్లతో పోల్చితే ఇప్పుడు ధరలు మారినందున అంచనా వ్యయం మరింత పెంచాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. పీఆర్ఎల్ఐలో మొత్తం ఆరు రిజర్వాయర్లు చేపట్టాల్సి ఉండగా.. గత ప్రభుత్వం కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్, లిఫ్టును పక్కన పెట్టింది. ఉదండాపూర్ నుంచే నీరిస్తామని అప్పటి ప్రజాప్రతినిధులు చెప్పారు. కానీ ప్రస్తుతం ఆ రిజర్వాయర్‌ను కూడా చేపట్టాలనే ఆలోచన ఉంది. ప్రధానంగా ఆయకట్టుకు నీరందించాల్సిన కాలువలు, డిస్ట్రిబ్యూటరీల వ్యవస్థను గాడిన పెట్టాల్సిన అవసరం ఉంది. ఎన్నికలకు ముందు వట్టెం కెనాల్ రెండు ప్యాకేజీలు, కరివెన రీచ్ 1, 2, ఉదండాపూర్ లెఫ్ట్ మెయిన్ కెనాల్, రైట్ మెయిన్ కెనాల్ తదితర పనులకు రూ.6,655 కోట్లతో టెండర్లను ఆహ్వానించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ టెండర్లు ఆయాచిత లబ్ధికి ఉద్దేశించినవని రద్దు చేసింది. ఇప్పుడు కాలువల నిర్మాణం, పెండింగ్ పనుల పూర్తి, ఉదండాపూర్ వద్ద ఆర్అండ్ఆర్ పనులు, కేపీ లక్ష్మీదేవిపల్లిని మళ్లీ చేపట్టడం వంటి పనులకు ప్రస్తుతం ఉన్న అంచనాల కంటే మరో రూ.35 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. అలాగే ఏదుల రిజర్వాయర్ నుంచి డిండికి రోజుకు 0.5 టీఎంసీలు తరలించకుండా.. శ్రీశైలం నుంచే తరలించేందుకు ప్రణాళిక చేయాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి, సత్వర నిధుల మంజూరు చేపట్టి, యుద్ధప్రాతిపదికన పాలమూరు- రంగారెడ్డి పూర్తికి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షలో అధికారులకు దిశానిర్దేశం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

పెండింగ్ ప్రాజెక్టులపైనా దృష్టి..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలు ఏళ్లుగా పెండింగ్ ప్రాజెక్టులుగానే ఉన్నాయి. ఆయా పథకాల కింద గత ప్రభుత్వం ఆయకట్టుకు నీటి విడుదల ప్రారంభించిప్పటికీ.. పెండింగ్ పనులను విస్మరించింది. తాజాగా ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించి, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి ఎన్ని కోట్లు అవసరమో ఒక అంచనాకు వచ్చారు. భీమా 1, 2లలో ఆర్అండ్ఆర్ సమస్య తీవ్రంగా ఉంది. గ్రామాలు ఖాళీ చేయకపోవడంతో శంకరసముద్రం, రంగసముద్రం వంటి రిజర్వాయర్లను పూర్తిగా నింపుకోలేని పరిస్థితి ఉంది. అలాగే తుమ్మిళ్ల కింద డిజైన్ ప్రకారం చేపట్టాల్సిన రిజర్వాయర్లపై గత ప్రభుత్వం ఆలోచన చేయలేదు. నెట్టెంపాడులో అంతర్భాగమైన ర్యాలంపాడు రిజర్వాయర్‌లో లీకేజీలను అరికట్టి, పూర్తి స్థాయిలో నింపడం ద్వారా గట్టు ఎత్తిపోతలకు నీరందించడంపై చర్చ జరిగే అవకాశం ఉంది. పెండింగ్ ప్రాజెక్టుల్లో పనుల పూర్తికి దాదాపు రూ.2,000 కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. కోయిల్‌సాగర్ పరిధి పనులకు రూ.235 కోట్లు, నారాయణపేట జిల్లాలోని సంగంబండ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పనులకు రూ.415 కోట్లు, కేఎల్ఐ అదనపు ఆయకట్టు పనులు, పరిహారం, మరమ్మతులకు రూ.440 కోట్లు, నెట్టెంపాడు, భీమా-2, తుమ్మిళ్ల, ర్యాలంపాడు మరమ్మతులు, జూరాల కాలువ మరమ్మతులకు రూ.1,000 కోట్లు అవసరమవుతాయని అధికారులు భావిస్తున్నారు. అలాగే కల్వకుర్తి కింద నీటి నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లు లేకపోవడంతో కనీసం ఐదు టీఎంసీల సామర్థ్యంతో నియోజకవర్గానికి ఒక రిజర్వాయర్‌ను నిర్మించాలనే ప్రతిపాదన కూడా ఉంది. పేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఇప్పటికే సర్వే పూర్తికాగా.. మొదటి దశ పనులకు సుమారు రూ.1,000 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిన్నింటిపైనా సీఎం రేవంత్‌రెడ్డి చర్చించనున్నారు.

సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా..

మహబూబ్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం పాలమూరు పర్యటనకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సీఎం బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరి 12:45 గంటలకు మహబూబ్‌నగర్ చేరుకుంటారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతారు. 12:45- ఒంటిగంట వరకు ఉమ్మడి జిల్లా ప్రముఖులతో ముఖాముఖి ఉంటుంది. మధ్యాహ్నం ఒంటి గంటకు మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 1:15 నుంచి 4:45 గంటల వరకు కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో జిల్లా ప్రగతిపై సమీక్ష చేస్తారు. సాయంత్రం ఐదు గంటల నుంచి 5:45 గంటల వరకు ఏఎస్ఎన్ గార్డెన్‌లో నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశం అవుతారు. సాయంత్రం ఆరు గంటలకు మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా పోలీస్‌శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. ఎస్పీ జానకి పోలీసులకు దిశానిర్దేశం చేశారు. మొత్తం 937 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏ.రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వనపర్తికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

- రూ.ఐదు కోట్ల నిధులు మంజూరు
- ఆరు లాంగ్‌టర్మ్ కోర్సులు, 23 షార్ట్‌టర్మ్ కోర్సులు
- అక్టోబరు 2న ప్రారంభించనున్న ప్రభుత్వం
- ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, జూలై 8: నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వనపర్తికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను మంజూరు చేసిందని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 65 ఐటీఐ సెంటర్లను స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలుగా నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. టాటా కంపెనీ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో వీటిని ఏర్పాటు చేస్తుందన్నారు. అందులో భాగంగా మొదటి దశలోనే వనపర్తికి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం మంజూరు అయ్యింది. రూ.ఐదు కోట్లు కేటాయించారన్నారు. ఈ కేంద్రాల ఏర్పాటు కోసం రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,324 కోట్లు కేటాయించారని తెలిపారు. అందులో ఆరు లాంగ్‌టర్మ్ కోర్సులు, 23 షార్ట్‌టర్మ్ కోర్సులు ఉన్నాయని చెప్పారు. అక్టోబరు 2వ తేదీ నుంచి ఈ కేంద్రాలను ప్రారంభించేలా ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. అధునాతన మిషనరీ, ఇన్‌స్ట్రక్టర్లు, అధునాతన కోర్సు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో పాటు రోబోటిక్ టెక్నాలజీ రాబోతుందన్నారు. నిరుద్యోగ యువకులకు ఇదొక శుభవార్త అని అన్నారు. మూడు, ఆరు మాసాలతో పాటు సంవత్సరం కోర్సులు ఉంటాయన్నారు. ద్వారా కోర్సు పూర్తి చేసుకున్న తరువాత విద్యార్థులకు టాటా కంపెనీ వారి సహకారం తోనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఎన్నికలకంటే ముందు అప్పటి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేసిన ఐటీ టవర్ కోసం రూ.22 కోట్ల పెట్టుబడి వనపర్తికి రాబోతుందన్నారు. త్వరలోనే 25 వేల స్క్వయర్‌ఫీట్లతో నిర్మించే భవనంలో ఐటీ టవర్ ఏర్పాటు చేసుకోబోతున్నామని చెప్పారు. ఏడు కంపెనీలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహించేందుకు ముందుకొచ్చాయని తెలిపారు. ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో పేరు నమోదు చేసుకున్న నిరుద్యోగులకు, ఐటీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఇదో సువర్ణ అవకాశంగా ఉంటుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, కోట్ల రవి, నందిమల్ల యాదయ్య, ఎండీ బాబా పాల్గొన్నారు.

ఆ దారి.. పూలదారి



రోడ్డుకు ఇరువైపులా చెట్లకు పూసిన ఎర్రని పూలు

రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆ అలంకరణ చెట్లకు ఎర్రని పూలు విరగబూశాయి. వర్షాలు పడటంతో చెట్లు పచ్చగా మారి, పూలతో కనువిందు చేస్తున్నాయి. రోడ్డు వెంట వెళ్తున్న వారికి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి వద్ద కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' సోమవారం క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి జిల్లా

మక్తల్‌లో భారీ చోరీ

- 66 తులాల బంగారం ఎత్తుకెళ్లిన దొంగలు



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి

మక్తల్, జూలై 8 : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని ద్వారకానగర్‌లో గల ఓ ఇంట్లో సోమవారం తెల్లవారుజామున భారీచోరీ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి సీఐ చంద్రశేఖర్, ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక సంగంబండ రోడ్ ద్వారక నగర్‌లో ఇంట్లో చిగుళ్లపల్లి రాఘవేందర్ కుటుంబం నివాసం ఉంటోంది. రాత్రి వారు నిద్రలోకి జారుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వంటగది తలుపులు విరగ్గొట్టిన దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉంచిన 66 తులాల బంగారం, రూ. 50 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఉదయం 5 గంటలకు ఇంటి యజమాని రాఘవేందర్‌కు మెలకువ వచ్చి చూడగా అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువా తలుపులు కూడా తెరిచి ఉండి వస్తువులు చిందరవందరగా పడి కనిపించాయి. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఇంటి సమీపంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి దొంగలను పట్టుకుంటామని సీఐ తెలిపారు. మక్తల్‌లో భారీ చోరీ జరగడం చర్చనీయాంశమైంది.

అందని చేయూత

- త్రిఫ్ట్ ఫండ్ పథకం కింద చేనేత కార్మికులకు అందని డబ్బులు
- 10 నెలలకుగాను రూ.9.67 కోట్ల బకాయి
- వచ్చే నెలతో ముగియనున్న పథకం గడువు



రాజోలిలో మగ్గంపై పట్టు చీరను తయారు చేస్తున్న దంపతులు

రాజోలి, జూలై 8: చేనేత కార్మికులకు చేయూత కరువైంది. వారిని ఆదుకునేందుకు గత ప్రభుత్వం అమలు చేసిన త్రిఫ్ట్ ఫండ్ పథకం అమలు కావడం లేదు. ఈ పథకం కింద కార్మికులు తమ నెలసరి ఆదాయంలో ఎనిమిది శాతం డబ్బు ఆర్డీ 1 ఖాతాలో జమ చేసుకుంటే.. ఆర్డీ 2 ఖాతాలో ప్రభుత్వం 16 శాతం డబ్బును జమ చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం పది నెలలుగా ఆర్డీ 2 ఖాతాలో డబ్బులు జమ చేయకపోవడంతో ఆర్డీ 1 ఖాతాలో కార్మికులు రెండు నెలలుగా తమ వాటాను జమ చేయడం లేదు. ఆగస్టుతో పథకం గడువు ముగుస్తుందని, పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ వాటా నిధులు వెంటనే విడుదల చేసి, తమకు డబ్బులు అందించాలని కార్మికులు కోరుతున్నారు.

2021లో ప్రారంభం

చేనేత కార్మికుల ఆర్థిక అభివృద్ధి కోసం గత ప్రభుత్వం 2021 ఆగస్టు ఏడున త్రిఫ్ట్ ఫండ్(నేతన్నకు చేయూత) పథకాన్ని చేపట్టింది. మూడేళ్ల కాల పరిమితితో అమలు చేసింది. ఒక్కో జియోట్యాగ్ నెంబరుపై ముగ్గురు కార్మికులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందేలా అవకాశం కల్పించారు. ప్రతీ కార్మికుడి నెలసరి ఆదాయంలో ఎనిమిది శాతం ఆర్డీ-1 ఖాతాలో జమ చేస్తే, ఆర్డీ-2 ఖాతాలో ప్రభుత్వం 16 శాతం డబ్బును ప్రతీ నెల జమ చేయాల్సి ఉంది. ఒక్కో కార్మికుడు కనీసం రూ.300 నుంచి రూ.1200 వరకు జమ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

రూ.9.67 కోట్లు బకాయి

జోగుళాంబ గద్వాల జిల్లాలో 2,240 జియోట్యాగ్ కలిగిన చేనేత మగ్గాలు ఉన్నాయి. వీటి ద్వారా 7,106 మంది కార్మికులు త్రిఫ్టు ఫండ్ పథకం కింద లబ్ధి పొందుతున్నారు. వీరికి 2023 సెప్టెంబరు వరకు మాత్రమే వారి ఆర్డీ-2 ఖాతాలో ప్రభుత్వం వాటా డబ్బును జమ చేసింది. నాటి నుంచి 10 నెలలుగా ప్రభుత్వం కార్మికుల ఖాతాల్లో డబ్బు జమ చేయలేదు. 10 నెలలకు మొత్తం రూ.9.67 కోట్లు బకాయి ఉంది. ప్రభుత్వం నుంచి రావాల్సిన వాటా రాకపోవడంతో కార్మికులు కూడా తమ ఆర్డీ-1 ఖాతాకు డబ్బు జమ చేసేందుకు నిరాకరిస్తున్నారు. ఆగస్టుతో ప్రభుత్వం పథకానికి నిర్దేశించిన మూడేళ్ల కాలపరిమితి ముగుస్తుండటంతో 10 నెలల బకాయి డబ్బులు ఇవ్వాలని కోరుతున్నారు.



జరీ దారాన్ని కండెలుగా చుడుతున్న వృద్ధురాలు

పెండింగ్ నిధులు విడుదల చేయాలి



త్రిఫ్టు ఫండ్ పథకంలో లబ్ధిపొందేందుకు అష్టకష్టాలు పడి ఆర్డీ-1 ఖాతాకు ఎనిమిది శాతం డబ్బులు జమ చేశాం. ప్రభుత్వం నుంచి రావాల్సిన 16 శాతం డబ్బులు 10 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం పెండింగ్ డబ్బును వెంటనే విడుదల చేయాలి.

- నారాయణ, చేనేత కార్మికుడు, రాజోలి

కార్మికులకు ఊరట కలిగించాలి



త్రిఫ్టు ఫండ్ పథకం ఆగస్టుతో ముగుస్తుంది. ప్రభుత్వం ఆర్డీ-2 ఖాతాలో పెండింగ్ డబ్బు వెంటనే జమ చేయాలి. పథకాన్ని ముగించి ఆర్డీ-1, ఆర్డీ-2 ఖాతాల్లోని డబ్బులను కార్మికులకు ఇప్పించి, ఊరట కలిగించాలి.

- నాగరాజు, చేనేత కార్మికుడు, రాజోలి

నిధులు త్వరలో అందుతాయి



త్రిఫ్టు ఫండ్ పథకం పెండింగ్ నిధులు రావాల్సి ఉంది. కార్మికులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. క్రమం తప్పకుండా ఆర్డీ-1లో డబ్బును జమ చేసుకోండి. పెండింగ్‌లో ఉన్న ఆర్డీ-2 డబ్బులు ప్రభుత్వం నుంచి త్వరలోనే వస్తాయి. పథఖం ఆగస్టు లేదా సెప్టెంబరులో సెప్టెంబరులో ముగుస్తుంది. త్వరలోనే కమిషనర్ ఆఫీసు నుంచి ఆదేశాలు వస్తాయి. వచ్చిన వెంటనే పథకం ముంగిపు చేసి, కార్మికులకు డబ్బు అందిస్తాం.

- గోవిందయ్య, చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు, జోగులాంబ గద్వాల జిల్లా

కుక్కను కొట్టాడని తమ్ముడిపై అన్న దాడి

బిజినేపల్లి, జూలై 8: తన కుక్కను కొట్టాడన్న కారణంతో తమ్ముడిపై అన్న కర్రతో దాడి చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వెల్గొండ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన బీరయ్య ఆదివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో గ్రామంలోనే ఉన్న తన తండ్రి ఇంటికి వెళ్లాడు. తిరిగి తన ఇంటికి వస్తుండగా, అన్న రాజు ఇంటి ముందున్న కుక్క మొరిగింది. కరిచేందుకు వస్తుందేమోనన్న భయంతో బీరయ్య పక్కనే ఉన్న రాయితో కుక్కను కొట్టాడు. అది గమనించిన రాజు నా కుక్కనే కొడతావా? అంటూ ఆవేశంతో పక్కనే ఉన్న కర్రతో బీరయ్యపై దాడి చేశాడు.

దాంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న బీరయ్య అన్న రాజుపై పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కిక్కే కిక్కు

- జిల్లాలో గణనీయంగా పెరిగిన మద్యం అమ్మకాలు
- అడ్డగోలుగా నల్లబెల్లం అక్రమ రవాణా
- మద్యం ధరలను పెంచి అమ్ముతున్న వైన్‌షాపు యాజమానులు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ


నాగర్‌కర్నూల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కందనూలు జిల్లాలో కిక్కే కిక్కు... జిల్లాలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాలుండగా మద్యం దిగుమతి అనూహ్యంగా పెరిగింది. నాలుగు నియోజకవర్గాల పరిధిలో 67 వైన్‌షాపులు, ఆరు బారు షాపులుండగా మద్యం వ్యాపారం కోట్లల్లో కొనసాగుతున్నది.

● నాలుగు నియోజకవర్గాల్లో కోట్ల వ్యాపారం

నాగర్‌కర్నూల్ జిల్లాలో 67మద్యం షాపులుండగా ఏడాదిన్నర వ్యవధిలో మద్యం వ్యాపారం రూ.వెయ్యి కోట్లకు పైగా దాటింది. శాసనసభ పార్లమెంట్ ఎన్నికలు రావడంతో వైన్‌షాపుల యజమానుల పంట పండింది. ప్రధాన రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు తమ అనుచర గణం ద్వారా ఓటర్లను మభ్య పెడుతూ మద్యాన్ని అక్రమ రవాణా చేశారు. ఈ క్రమంలో గతేడాదే జనవరిలో ఒక లక్ష 57వేల 850 లిక్కర్ కేస్‌లు అమ్ముడు కాగా, ఒక లక్ష 85వేల 404 బీరు కేస్‌లు అమ్ముడయ్యాయి. తద్వారా ఒక కోటి 46లక్షల 84వేల ఆదాయం ఐఎంఎఫ్ఎల్‌కు వచ్చింది. ఫిబ్రవరిలో 13కోట్ల 86వేల ఆదాయం రాగా మార్చి నెలలో ఆదాయం గణనీయంగా పెరిగింది. 260కోట్ల 82లక్షల ఆదాయం రాగా ఏప్రిల్‌లో ఒక లక్ష 25వేల 126 కేస్‌ల లిక్కర్ అమ్ముడు కాగా వేసవి కారణంగా 2లక్షల 37వేల 325బీరు కేస్‌లు అమ్ముడయ్యాయి. తద్వారా బ్యూవరీస్ కార్పొరేషన్‌కు 157కోట్ల 83లక్షల లావాదేవీలు జరిగాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో కూడా మద్యం విక్రయాల ద్వారా గణనీయ మైన లాభాలను బ్యూవరీస్ కార్పొరేషన్ గడించింది.

● పెరిగిన మీడియం మద్యం ధరలు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు ఎక్సైజ్ శాఖ మీద ఆధారపడిన ప్రభుత్వం ఇటీవల మధ్యరకం లిక్కర్ ధరను 30శాతం మేరకు పెంచింది. ఈ విషయం గుట్టుచప్పుడు కాకుండా ఎక్సైజ్ శాఖ అమలు చేస్తోంది. అయితే కొత్త మద్యం సీసాలు వచ్చినంత వరకు వేచి చూడాల్సిన వైన్ షాపుల యజమానులు పాత సరుకును కొత్త స్టిక్కర్లు అంటించి దండుకుంటున్నా నోరు మెదపడం లేదు.



నాగర్‌కర్నూల్‌లో మద్యం కాటన్లు

వర్షాలతో ఊపిరి పీల్చుకున్న రైతులు

- వర్షాలతో ఊపిరి పీల్చుకున్న రైతులు
- సస్య రక్షణపై అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయాలంటున్న రైతులు

మానవపాడు, జూలై 8 : ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఖరీఫ్ సీజన్‌లో వేసిన పత్తి, కంది, బెండ, మిర్చి విత్తనాలకు ఢోకా లేదని రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. రుతుపవనాలు చురుకుగా కదులుతున్నందున ప్రస్తుతం మొక్కలకు కావల్సిన వర్షం కురుస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జూన్ నెల ప్రారంభంలోనే కురిసిన వర్షాలకు రైతులు పత్తి గింజలను విత్తారు. అప్పటి నుంచి సరైన వర్షం లేకపోవడంతో రైతులు విత్తనాలను విత్తలేకపోయారు.

ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఖరీఫ్‌లో వేసే పంటలు వేశారు. జిల్లా వ్యాప్తంగా ఐదు లక్షల యాభై వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా ఖరీఫ్ సీజన్‌లో మూడు లక్షల యాభై వేల ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో పత్తి మాత్రం లక్షా ఇరవై వేల వరకు సాగు చేయగా మిగతా రెండు లక్షల 30 వేల ఎకరాల్లో కంది, బెండ, మిర్చి, పండ్ల తోటలు, పూలతోటలు సాగు చేసినట్లు ఏడీఏ సక్రియానాయక్ వివరించారు. పత్తి రైతులకు మొదటి నుంచి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయకపోవడంతో నష్టాలకు గురవుతున్నామని, ప్రతీ ఏడాది విత్తనాలతోనే సమస్యలు వస్తున్నట్లు రైతులు అధికారులకు తెలుపుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. మొక్క చిన్నతనంలో పచ్చదనంతో కళకళలాడుతున్న పత్తి పంటలు కాపు దశ వచ్చేవరకు దోమ, గులాబీరంగు పురుగు ఆశించడంతో ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు వాపోతున్నారు. ఇందుకు ప్రతీ రైతుకు ఖరీఫ్ పంటలపై అవగాహన కల్పించకపోవడంతోనే నష్టాల బారిన పడుతున్నామని మండిపడుతున్నారు.


సేద్యం చేస్తున్న యువ రైతులు

విత్తనాలు మొలకెత్తడం లేదు..



నల్లరేగడి పొలాలు కావడంతో జిల్లాలో అధికంగా పత్తి పంట సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు పత్తి సాగుపై మక్కువ చూపుతున్నారు. కానీ పత్తి మొక్కలు సరిగ్గా మొలకెత్తడం లేదు. ప్రతీ రైతు ఒకే పొలంలో రెండు లేదా మూడుసార్లు విత్తనాలు వేసే పరిస్థితి నెలకొంది. విత్తనాలను పరిశీలించి ఇవ్వాలి. రైతులకు అవగాహన లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. - రైతు మల్లికార్జున్‌రెడ్డి

ప్రతీ వారం ఏర్పాటు చేస్తాం..

ప్రతీవారంలో ఒకసారి రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం పంటలపై ఏమైనా సందేహాలుంటే తప్పనిసరిగా పంట పొలాలకు వచ్చి పరిశీలన చేస్తామని ఏడీఏ సక్రియానాయక్ అన్నారు.

- ఏడీఏ సక్రియానాయక్

కర్నెతండా లిఫ్ట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి లట్టుపల్లి గిరిజన తండాల ప్రజలు విజ్ఞప్తి


కర్నెతండా లిఫ్ట్ వద్ద రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసిన గిరిజన తండాల ప్రజలు

బిజినేపల్లి, జూలై 8 : లట్టుపల్లి శివారులో కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన కర్నెతండా లిఫ్టును త్వరితగతిన పూర్తి చేసి గిరిజన తండాలకు తాగు, సాగునీరు అందించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డికి లట్టుపల్లి గిరిజన తండాల ప్రజలు విజ్ఞప్తి చేశారు. మండలంలోని లట్టుపల్లి శివారులోని మీట్యాతండా సమీపంలో నిర్మిస్తున్న కర్నెతండా లిఫ్టును సోమవారం చిన్నారెడ్డి సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఊడుగుల కుంట తండా, నక్కల చెరువు తండాకు కాలువను దాటుకుంటూ వెళ్లేందుకు అవసరమైన బ్రిడ్జి పనులను పూర్తి చేసి ప్రజలకు ఇక్కట్లు కల్గకుండా చూడాలని గుత్తేదారులను ఆయన ఆదేశించారు. అనంతరం చిన్నారెడ్డి, ఘనపూర్ మాజీ ఎంపీపీ కృష్ణానాయక్‌లను లట్టుపల్లి గిరిజనులు గోవిందునాయక్, కలియనాయక్, బాలు నాయక్, రాజు నాయక్, హనుమంత్ నాయక్, దీపక్ నాయక్, పీట్యానాయక్, వద్యావత్ హనుమంత్ నాయక్‌లు శాలువాలతో సన్మానించారు.

ఇసుక, మట్టి మాఫియాపై చర్యలేవి?

- మదనాపురం మండలంలో జోరుగా మట్టి, ఇసుక మాఫియా
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు
- ఎర్రగట్టు, దేవరగుట్టలే అడ్డా


ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

మదనాపురం, జూలై 8: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరం కృషి చేయాలని, పెద్ద పెద్ద ప్రసంగాలు చేసే అధికారులే దానికి తూట్లు పోడుస్తున్నారు. ప్రభుత్వం హరితహారం పేరుతో నిధులు పెట్టించి ప్రభుత్వ భూములు, గుట్టలు రహదారుల వెంబడి మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిస్తున్నారు. కానీ వనపర్తి జిల్లా మదనాపురం మండలంలో మాత్రం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చర్యలు కొనసాగుతున్నాయి. మండలంలోని ఊక చెట్టు వాగు నుంచి రాత్రి వేళల్లో ఎక్స్‌కవేటర్ల సహాయంతో పెద్ద ఎత్తున ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నా అటూ పోలీసు, రెవెన్యూ యంత్రాంగం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తోంది. పది రోజుల కిందట వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని రైతులు డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు సంఘటన స్థలానికి వచ్చే లోపు ఇసుక అక్రమార్కులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మేము పోలీసులకు సమాచారం ఇస్తే అక్రమ మాఫియాదారులకు ఎలా తెలుస్తుందోనని రైతుల ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా వారి కనుసన్నులతోనే జరుగుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. రైతులు ఒత్తిడితో గోపన్‌పేట గ్రామంలో కొన్ని ఇసుక డంపులను అధికారులు సీజ్ చేశారు.

- గుట్టలే లక్ష్యం...

మండలంలో దేవరగుట్ట, ఎర్రగుట్ట ఎక్కువ విస్తీర్ణంలో పెద్ద పెద్ద చెట్లతో పచ్చగా ఉన్నాయి. వీటిపై మట్టి మాఫియా కన్ను పడింది. చెట్లను నరికి వేసి ఎర్ర మట్టిని దర్జాగా తరలించుకుపోతున్న అడిగే నాథుడే లేదు. అక్రమాలను అరికట్టే పోలీసులున్నా ప్రయోజనం లేదని పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు. ఆదివారం మండలంలోని దేవరగుట్ట నుంచి ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఎస్ఐ శేఖర్‌రెడ్డికి చెప్పగా వారికి అనుమతులు ఉన్నాయని చెప్పడం గమనార్హం. కానీ అనుమతులకు సంబంధించి పత్రాలు ఎవరి దగ్గర లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే పర్యావరణ పరిరక్షణకు కృషి చేసేవారవుతారని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

'స్పౌజ్ ఎస్జీటీ బదిలీలకు రీకౌన్సెలింగ్ నిర్వహించాలి'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 8 : సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ బదిలీల్లో పలువురు ఉపాధ్యాయులు నిబంధనలను తుంగలో తొక్కి దొడ్డిదారిన తమకు ఇష్టమొచ్చిన విధంగా స్పౌజ్ పెట్టి తప్పుదారి పట్టించారని దీనిపై విద్యాశాఖ దృష్టి పెట్టి స్పౌజ్ ద్వారా బదిలీలు పొందిన ఎస్జీటీల బదిలీలు రద్దు చేసి రీకౌన్సెలింగ్ నిర్వహించాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాం బాబు, రమాకాంత్‌లు డిమాండ్ చేశారు. బదిలీల్లో జరిగిన అవకతవకలపై సోమవారం వారు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయుల బదిలీల్లో పలువురు స్పౌజ్ టీచర్లు అవకాశం లేకున్నా తప్పుడు సమాచారం ఇచ్చి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని తమకిష్టమొచ్చిన విధంగా ప్లేసులు తీసుకున్నారని పేర్కొన్నారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను సైతం పట్టించుకోకుండా కొందరు టీచర్లు తమకిష్టమొచ్చిన విధంగా ప్లేసులు తీసుకున్నారన్నారు. విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకుపోయినా ఇప్పటికీ చర్యలు చేపట్టలేదని దీనిపై ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

'విద్యకు దూరవుమతున్న ఆదివాసీ పిల్లలు'

పెద్దకొత్తపల్లి, జూలై 8: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల కారణంగా ఆదివాసీ పిల్లలు విద్యకు దూరమవుతున్నారని పౌర హక్కుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కాబాలయ్య, కేఎన్‌పీఎస్ (కులనిర్మూలన పోరాట సమితి) నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ సభ్యులు ముద్దునూరు సత్యనారాయణలు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మారేడుమానుదిన్నె గ్రామాన్ని వారు సందర్శించి వివరాలు సేకరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మారేడుమానుదిన్నె గ్రామంలో చదువుకునే ఇద్దరు బాలురను అదే గ్రామానికి చెందిన సొప్పరి బంగారయ్య, సొప్పరి కృష్ణయ్యలు వెట్టి చాకిరీ చేయించుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై నిజ నిర్ధారణకు వెళ్లగా బాధితులను కలిసి వివరాలు సేకరించగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. తక్షణమే ఐటీడీఏ పీవో గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాల ని డిమాండ్ చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి నాన్‌బెయిలబుల్ సెక్షన్ పెట్టాలని వారు కోరారు. తెలంగాణ ప్రజాఫంట్ రాష్ట్ర కో కన్వీనర్ ఎడ్ల అంబయ్య, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్

రాజోలి, జులై 8 : గద్వాల జిల్లా రాజోలి శివారులోని తుంగభద్ర నదిలో నుంచి అనుమతులు లేకుండా నిల్వ చేసిన ఇసుక డంపులను సోమ వారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షఫీ సీజ్ చేశారు. గ్రామంలోని పెద్దమ్మ ఆల యం దగ్గర అక్రమంగా ఇసుకను డంప్ చేశారని సోమవారం తెల్లవారు జామున సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులకు రెవెన్యూ అధికారులు స్పందించి ఈమేరకు సీజ్ చేశారు. ఈ విషయమై రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ ను వివరణ కోరగా కొందరు వ్యక్తులు ప్రభుత్వం అనుమతులు లేకుండా నదిలోకి దిగి ఇసుకను తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అట్టివారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. త్వరలో ఇసుక అక్రమ రవాణాకు పా ల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. 15 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసి, మైనింగ్ అధికారులను తెలిపినట్లు ఎస్ఐ వెల్లడించారు.

సైబర్ క్రైం కేసు నమోదు

ఉప్పునుంతల, జూలై8 : నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలో ఓ సైబర్ క్రైం కేసు నమోదు అయింది. ఇందుకు సంబంధించి ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా డిండి మండలంలోని జర్రియ తండా గ్రామానికి చెందిన రమావత్ హనుమంత్ బతుకుదెరువు కోసం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని దేవదారికుంటతండా గ్రామంలో నివాసం ఉంటున్నాడు. రమావత్ హనుమంత్‌కు మే 14న హర్షసాయి అని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌లో పరిచయం చేసుకొని ఆర్థిక సాయం చేస్తానని నమ్మించాడు. ఇందుకు రూ. నాలుగు వేలు ఫోన్ పే చేయాలన్ని చెప్పారు. అది నమ్మి హనుమంత్ డబ్బులు ఫోన్‌పే చేశారు. అదే క్రమంలో రూ. 52వేల 500 మళ్లీ ఫోన్‌పే చేశారు. ఆ తర్వాత ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో మోసపోయాని గుర్తించి సైబర్‌క్రైం 1930 ఫోన్ చేసి సోమవారం హనుమంత్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వస్తువులు దగ్ధం

తెలకపల్లి, జూలై 8 : షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్ పేలడంతో ఇతర వస్తువులు పాడైపోయాయి. దీనికి సంబంధించి బాధితుల కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోని బోడ శ్రీనివాసులు అనే వ్యక్తి ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దాంతో ఇంట్లో ఉన్న వస్తువులు ఫ్రిడ్జ్ అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. కుటుంబ సభ్యులందరూ ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లిపోయారు. చుట్టుపక్కల వారు దట్టమైన పొగలు అలుముకోవడంతో ఇల్లు కాలిపోతుందని గ్రహించి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. దాంతోపాటు విద్యుత్ అధికారులు వచ్చి కనెక్షన్ కట్ చేశారు.

వ్యక్తి మిస్సింగ్‌పై కేసు నమోదు

ఆత్మకూరు, జూలై 8:వ్యక్తి మిస్సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. గ్రామానికి చెందిన కేశపాగ లక్ష్మీ బుచ్చన్న దంపతులు గత 19 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది . కాగా గత పది సంవత్సరాల క్రితం నుంచి మతిస్థిమితం లేకుండా ఉండి గతంలో రెండు , మూడు సార్లు ఇంటి వద్ద నుంచి వెళ్లిపోయి మళ్లీ తిరిగి వచ్చేవాడు. గత సంవత్సరం కాలం నుంచి ఇంటి దగ్గర నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. భర్త ఆచూకీ తెలుసుకోవాలని పోలీస్ స్టేషన్‌ల ఫిర్యాదు చేసిందని ఎస్ఐ నరేందర్ తెలిపారు.

బల్కంపేట ఎల్లమ్మకు గద్వాల పట్టు వస్త్రాలు



ఎల్లమ్మ దేవతకు గద్వాల పట్టు వస్త్రాలను అందిస్తున్న దృశ్యం

గద్వాల, జూలై 8: బల్కంపేట ఎల్లమ్మ దేవతకు గద్వాల జిల్లా కేంద్రంలోని జములమ్మ ఆలయం తరుపున సోమవారం పట్టువస్త్రాల అందించినట్లు ఆలయ డైరెక్టర్ ఓంప్రకాష్ కాంమ్లే తెలిపారు. నాలుగేళ్లుగా హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ దేవతకు సారె అందించడం ఆనవాయితీ చేశారు. ఈ ఏడాది కూడా జములమ్మ ఆలయం తరుపున గద్వాల పట్టుచీరతో పాటు సారెను ఎండోమెంట్ అధికారులకు అందించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ సతీష్, నాయకులు తోటరాముడు, రవి, సురేష్ తదితరులున్నారు.

పారా బాయిల్డ్ రైస్‌మిల్ తనిఖీ



కల్వకుర్తిలో సద్గురు రాఘవేంద్ర రైస్‌మిల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

కల్వకుర్తి, జూలై 8 : కల్వకుర్తి పట్టణంలోని సద్గురు రాఘవేంద్ర పారా బాయిల్డ్ ఇండస్ట్రీని సివిల్ సప్లయ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ సీఎస్ఎస్‌డీ చౌహాన్ ఆదేశాల మేరకు కల్వకుర్తిలోని సద్గురు రాఘవేంద్ర పారా బాయిల్డ్ ఇండస్ట్రీలో ధాన్యం నిల్వలను మహబూబ్‌నగర్ జిల్లా పౌరసరఫరా అధికారి శ్రీనివాస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ టీం ద్రోణచార్యులు, వెంకటేశ్వర్లు పరిశీలించి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంఆర్‌తో పాటు వేలం వేసిన ధాన్యం త్వరితగతిన లిఫ్టు చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, డిప్యూటీ తహసీల్దార్, సబ్ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్, సిబ్బంది, మిల్లు యాజమాని జూలూరి రమేష్‌బాబు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 8: శ్రీకృష్ణ కాలచక్ర ఆయుత చండీ అతిరుద్ర 83వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం రెండో రోజు సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. యాగ నిర్వాహకులు శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆధ్వర్యంలో ఉదయం ఏడు గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గణపతి, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. అనంతరం లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కల్యాణ క్రతువులో కనుల పండువగా సాగింది. అనంతరం లక్ష్మీగణపతి, రుద్ర హోమాలను భక్తులు సామూహికంగా నిర్వహించారు. తదనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం ఆరాధన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తల్లిని చంపిన కేసులో తనయుడికి జైలు శిక్ష

గద్వాల క్రైం, జూలై 8 : తల్లిపై గొడ్డలితో దాడి చేసి చంపిన కేసులో నిందితుడైన కొడుకుకు పది సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ. 500 జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా జడ్జి కె. కుష తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్పీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన కృష్ణజడ రాముడు, నాగమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, నలుగురు కూతుర్లు ఉన్నారు. చిన్నకుమారుడు కృష్ణజడ ప్రేమ్‌రాజ్ హైదరాబాద్‌కు చెందిన అమ్మాయిని ప్రేమించి పెళ్లిచేసుకుని అక్కడే నివాసం ఉండేవాడు. డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధించేవాడు. 2023, ఏప్రిల్ 7న ప్రేమ్‌రాజ్ ఇంటి ముందు ఉన్న చెట్టును నరుకుతుంటే తండ్రి వారించాడు. దాంతో నిన్ను నరుకుతా అంటూ తండ్రిపై గొడ్డలితో దాడి చేసేందుకు వెళ్ల తల్లి నాగమ్మ(60) అడ్డు రావడంతో ఆవేశంలో ఆమెను నరుకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఇంటి పక్కవారు పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయాడు. తండ్రి కృష్ణజడ రాముడు ఫిర్యాదు మేరకు శాంతినగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం కేసు విచారణకు రాగా నేరం రుజువు కావడంతో జిల్లా న్యాయాధికారి కె. కుష నిందితుడు కృష్ణజడ ప్రేమ్‌కుమార్ అలియాజ్ రాజ్‌కు పది సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ. 500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు. నేరస్థుడికి జైలుశిక్ష పడటానికి కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ త్రిపాఠి, కోర్టు లైసెన్ హెడ్‌కానిస్టేబుల్ పరమేష్, కోర్టు కానిస్టేబుల్ గౌస్‌ఫీర్‌లను ఎస్పీ అభినందించారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

ధరూరు, జూలై 8 : కడుపునొప్పి భరించలేక, ఇతర అనారోగ్య కారణాలతో బాధపడుతూ ఓ యువకుడు ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గద్వాల జిల్లా ధరూరు మండల పరిధిలోని బూరెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ధరూరు మండల పరిధిలోని బూరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ రెడ్డి(27) ఐదు సంవత్సరాల నుంచి ఆయాసంతో పాటు కడుపునొప్పితో బాధప డుతూ ఉండేవాడు. దీంతో ఆదివారం రాత్రి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒక గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న తండ్రి ఇంట్లోని గదిలోకి వెళ్లి చూడగా అప్పటికే అప స్మారకస్థితికి చేరుకున్న రాజశేఖర్ రెడ్డిని వెంటనే చికిత్స నిమిత్తం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

జూరాలకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

ధరూరు, జూలై 8 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వరద నీరు స్వల్పంగా వచ్చి చేరుతున్నట్లు జూరాల అధికారులు సోమవారం తెలిపారు. ఎగువనున్న ఆల్మట్టి జలాశయంలో 66.54 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, దిగువనున్న నారాయణపూర్ జలాశయంలో 25.06 టీఎంసీల నీరు నిల్వకు చేరుకుంది. దిగువన ఉన్న జూరాల జలాశయంలో 317.530 మీటర్లలో నీటి నిల్వ ఉండగా, ప్రాజెక్టులో 5.038 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో ప్రస్తుతం జూరాల జలాశయంలో 2,051 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా నమెదు కాగా, కుడి, ఎడమ కాల్వలతో పాటు నెట్టెంపాడు, భీమా, ఆర్డీఎస్, భీమా లిఫ్ట్-2, సమాంతర కాల్వలకు నీటి నిల్వలను నిలిపివేసినట్లు జూరాల ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

సెమిస్టర్ పరీక్ష ఫీజులను తగ్గించాలి



పీయూ పరీక్ష విభాగం భవనం ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులు

పాలమూరు యూ నివర్సిటీ, జూలై 8: పెంచిన నాలుగవ సె మిస్టర్ పరీక్ష ఫీజుల ను తగ్గించాలని వి ద్యార్థులు కోరారు. సోమవారం పీయూ పరీక్షల విభాగం భవ నం ముందు విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పీయూ పరీక్షల నిర్వాహణ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. రెండు రోజుల్లో తగ్గించక పోతే పీయూ ప్రధాన గేటు వద్ద ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతామని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకుడు రూప్ సింగ్, ప్రవీణ్, అశోక్, బాలరాజ్, మధు, నాగరాజు, శ్రావణి, సౌజన్య, నవీన, ప్రభావతి, శ్రీను వాస్, భరత్, రవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం హద్దులు చూసుకోం

- ఉమ్మడి పాలమూరు అంతా అభివృద్ధి చెందడమే లక్ష్యం
- ప్రాజెక్టులు, విద్య,వైద్యం లక్ష్యంగా సీఎం రేవంత్‌తో చర్చిస్తాం
- ఎమ్మెల్యేలు యెన్నం, జీఎంఆర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్,జూలై 8: పాలమూరు జిల్లా అభివృద్ధి విషయంలో గత పాలకుల మాదిరిగా హద్దులు, సరిహద్దులు చూసుకోమని ఉమ్మడి పాల మూరు జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యేలమంతా సమిష్టిగా పనిచేస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జి మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టులు, విద్యా వైద్య రంగాలను గత పాలకులు విధ్వంసం చేశారని, ఇప్పుడు వాటి అభివృద్ధే లక్ష్యంగా వాటికి నిధుల సర్దుబాటుపై జిల్లాకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవిస్తామని తెలిపారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌పై ప్రదానంగా చర్చ జరుగుతుందని, ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలం కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగిందని, దీనిపై సీఎంకు ప్రజెంటేషన్ ఇస్తామన్నారు. నిర్మాణంలో ఉన్న మహబూబ్‌నగర్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రితో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందనుందని ఈ ఆసుపత్రి నిర్మాణం త్వరిగతిన చేపట్టి అందుబాటులోకి తీసుకోవస్తే జిల్లా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అదేవిధంగా మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూతుర్పూర్ ట్రై జంక్షన్ వద్ద ప్రభుత్వ భూములున్నాయని అక్కడ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఏర్పాటు చేస్తే మూడు రాష్ట్రాలకు లబ్ది చేకూరనుందని తెలిపారు. పాలమూరు యూనివర్సిటీకి రూ.100 కోట్ల నిధులు రావడంతో విద్యాపరంగా ఉమ్మడి జిల్లాకు మంచి రోజులు రానున్నాయని, యూనివర్సిటీలో లా, ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయన్నారు. జిల్లా అభివృద్ధి విషయంలో అందరిని కలుపుకుని ముందుకుపోతామని, అందరి సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. ఎంపీగా గెలిచిన డీకే అరుణ కూడా పాలమూరు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరుతున్నామని, మహబూబ్‌నగర్‌కు కేంద్రం నుంచి వచ్చే నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లా పర్యటనకు వస్తున్న సీఎం రేవంత్ ముందుగా అరగంట పాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో మాట్లాడిన తరువాత అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని, అనంతరం ఏఎస్ఎన్ గార్డెన్‌లో ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు ఒబేదుల్లా కొత్వాల్, వినోద్‌కుమార్, ఎన్‌పీ వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్, రాములు యాదవ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు ప్రచారాలు ఆపండి

- నేను టూరిజం ప్లాజా లీజుకు తీసుకుంటే నిరూపించండి
- మాజీమంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, జూలై 8: అసత్య ప్రచారాలు, మోసపూరిత చర్యలతో ఎన్నికల్లో లబ్ధిపొందారని, గెలిచాక కూడా తనపై తప్పుడు ప్రచారాలు చేయడమే పనిగా పెట్టుకోవడం సరికాదని మాజీ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని న్యూటౌన్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహబూబ్‌నగర్ బస్టాండ్ వద్ద గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులను తలపించేరీతిలో 1,000 పడకల ఆస్పత్రిని తెచ్చామని, అలాంటి భవనం స్వాతంత్ర్యం వచ్చిన దగ్గరనుంచి ఇప్పటివరకు ఎక్కడైనా ఎవరైనా కట్టించారో చూపించాలని ప్రశ్నించారు. ఆస్పత్రి పనులను పరిశీలించేందుకు వచ్చిన మంత్రికి ఇక్కడి ఎమ్మెల్యే దవాఖానా ముందు టూరిజం ప్లాజాను శ్రీనివాస్‌గౌడ్ 99 ఏళ్లకు లీజుకు తీసుకున్నాడని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వంలో మీరే ఉన్నారని, తాను లీజుకు తీసుకుంటే ఆ కాగితాలు చూపించాలన్నారు. తప్పుడు ప్రచారాలు, అబద్ధాలు ఇంకా ఎన్నిరోజులు చెబుతారని, ముందు పాలమూరు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హమీలు నెరవేర్చడంపై ఆలోచన చేయాలని సూచించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఎన్నో పనులు చేపట్టామని, అందులో చాలా పనులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. దాదాపు రూ. 1,800 కోట్లకు సంబంధించిన పనులు మహబూబ్‌నగర్‌లో చేపట్టాల్సి ఉందన్నారు. ముందు ఆ పనులన్నీ టేకప్ చేసేలా చర్యలు తీసుకుంటే మహబూబ్‌నగర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. టెండర్లు అయ్యాయి అంటే బడ్జెట్ కేటాయించినట్లేనని, ఆ పనులు చేయకుండా బడ్జెట్ లేదని చెప్పడం సరైనది కాదన్నారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు గమనించాలన్నారు. పదేళ్లలో మహబూబ్‌నగర్ అభివృద్ధి కోసం ఎంతో కష్టపడ్డానని వివరించారు. పనులు చేసే క్రమంలో కొన్ని పొరపాట్లు జరిగి ఉండొచ్చని, మరోసారి అలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకుని ఈ జిల్లా అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. తన ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలను తొలగించడం మంచి సంస్కృతి కాదని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తించాలని అన్నారు. ఫ్లెక్సీల్లో ఫొటోలు తొలగించినంత సులువుగా ప్రజల మనసుల్లోంచి తనను తొలగించలేరన్నారు. ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకున్నంత మాత్రాన తమ పార్టీకి నష్టమేమీ ఉండదన్నారు. మళ్లీ పుంజుకుని అధికారంలోకి వస్తామన్నారు. కాంగ్రెస్ పని అయిపోయిందన్న సమయంలో మళ్లీ అధికారంలోకి రాలేదా అని గుర్తుచేశారు. సమావేశంలో నాయకులు కోరమోని నర్సింహులు, కోరమోని వెంకటయ్య, గంజి ఎంకన్న, శివరాజు, తాటిగణేష్, అనంతరెడ్డి, రాము, నవకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

పీయూలో కొత్త కోర్సులను ప్రవేశ పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీయూ విద్యార్థి జేఏసి నాయకుడు బత్తిని రాము

పాలమూరు యూనివర్సిటీ, జూలై 8: పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజనీరింగ్ కోర్సులతో పాటు కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని పీయూ విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పీయూ పీజీ కళాశాలలో అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం సొంత జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి వస్తున్న నేపథ్యంలో పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధికి అధిక నిధులు విడుదల చేయాలని కోరారు. యూనివర్సిటీలో పనిచేస్తున్న అధ్యాపకులను, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, నాన్ టీచింగ్ ఉద్యోగులను కాంట్రాక్ పద్ధతిలోకి మార్చాలని కోరారు. సీఎం సొంత జిల్లాలో ఉన్న యూనివర్సిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశంలో పీయూ విద్యార్థి నాయకులు పీయూ జేఏసీ చైర్మన్ బత్తిని రాము, టీఆర్ఎస్‌వీ పీయూ అధ్యక్షుడు భరత్, విద్యార్థి నాయకులు రామ్‌దేవ్, జగదీష్, హరి, రఘు, దినకర్ పాల్గొన్నారు.

యూనివర్సిటీకి 500 కోట్లు కేటాయించాలి

- ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్

పాలమూరు యూనివర్సిటీకి సీఎం రేవంత్ రెడ్డి రూ. 500 కోట్ల నిధులను కేటాయించాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ కోరారు. సోమవారం మాదిగ విద్యార్థి ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్)ఆధ్వర్యం పీయూ అధ్యక్షుడు మీసాల గణేష్ అధ్యక్షత నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో కార్తీక్ మాట్లాడుతూ యూనివర్సిటీకి మాదిగ సామాజికవర్గానికి చెందిన వారిని వీసీగా అవకాశం ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టును వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పీయూలో ఎల్ఎల్ఎం తోపాటుగా ఎల్ఎల్‌బీ కోర్సులను ప్రవేశ పెట్టాలని కోరారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు కృష్ణమోహన్, కిరణ్‌కుమార్, బాలకృష్ణ, అంజి, హరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ నుంచి గ్రూప్ -1 మెయిన్స్‌కు 30 మంది ఎంపిక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూలై 8 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1 కోసం శిక్షణ పొందిన అభ్యర్థుల్లో 30 మంది మెయిన్స్‌కు ఎంపిక అయినట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ కాడం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం విడుదల అయిన ఫలితాలలో స్టడీ సర్కిల్‌కు చెందిన అభ్యర్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపై మరో ఇద్దరు టీచర్లకు షోకాజ్ నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూలై 8 : ఉపాధ్యా యుల బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగం చేసి న ఉపాధ్యాయుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. స్పౌజ్ పాయింట్ల తప్పిదాలపై 'ఆంధ్రజ్యోతి'లో వస్తున్న వరుస కథనాలు తప్పుచేసిన టీచర్లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే జడ్చర్ల మండల పరిధిలోని స్పౌజ్ పాయింట్ల విషయంలో తప్పుచేసిన నలుగు టీచర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వారు ఇచ్చిన సమాధానం జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు విచారణ సాగుతోంది. ఇది సాగుతుండగానే తప్పుచేసిన టీచర్లు ఎవరు? ఎంత మంది ఉన్నారు? అన్నదానిపై అన్ని మండలాల వారిగా వివరాలు సేకరించే పనిలో మండల విద్యాశాఖ అధికారుల నిమగ్నమయ్యారు. మహబూబ్‌నగర్ మండల పరిధిలోని జీవో నెంబర్ 5ను దుర్వినియోగం చేసి స్పౌజ్ పాయిం ట్లను వినియోగించుకున్న ఉపాధ్యాయులకు సోమవారం మండల విద్యాశాఖ అధికారి జయశ్రీ ఇద్దరికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం అయినా స్పౌజ్ దుర్వినియోగం జీహెచ్ఎం టీచర్ల ఫైవేటు..! అన్న కథనం కలకలం రేపింది. పలువురు టీచర్లు దీనిపై చర్చించుకున్నారు. స్పౌజ్ పాయింట్లు తప్పిదాలు ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతులలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని, తప్పు చేసిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు వెంకటేష్ , కె. రవికుమార్ , మహ్మద్, ఆదిత్య ,ఎస్.వెంకటేశ్వర్లు డీఈవోకు వినతి పత్రం అందజేశారు. మొత్తంగా స్పౌజ్ పాయింట్ల తప్పిదంపై రాష్ట్ర అధికారుల కూడా దృష్టి సాధించారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కూడా మహబూబ్‌నగర్ డీఈవోకు ఫోన్ చేసి స్పౌజ్ పాయింట్ల విషయంపై పూర్తి నివేదిక ఇవ్వాలని గట్టిగా హెచ్చరించినట్లు ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య
- వచ్చేనెల మూడవ వారంలో ఫెడరేషన్ జిల్లా మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య

పాలమూరు, జూలై8 : జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం తప్పదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్)రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు వాకిటి అశోక్, గండీడు నరసింహ, యం.గోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పదే శ్ళ గా బీఆర్ఎస్ హయాంలో జర్నలిస్టుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. దానికోసం జిల్లాలో ఎన్నో పోరాటాలు ఫెడరేషన్ చేసిందన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, అక్రిడిటేషన్ ఇతర సమస్యలపై నిరాహారదీక్షలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్న జర్నలిస్టులను కాంగ్రెస్ ప్రభుత్వమైన పట్టించుకుని న్యాయం చేయాలన్నారు. జర్నలిస్టుల న్యాయమైన సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఇళ్లస్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చే విషయమై అందరికి సమన్యాయం చేసేవిధంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. హెల్త్‌కార్డుతో ఉచిత వైద్య ఆరోగ్య సదుపాయం కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరి పదవి విరమణ పొందిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మహబూబ్‌నగర్ జిల్లా మూడో మహసభ ఆగస్టు మూడో వారంలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యవర్గం నిర్ణయించింది. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, హెల్త్‌కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని జిల్లా కార్యవర్గం తీర్మానించిందని ప్రకటించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్‌కుమార్, నాయకులు పులిపలుపుల ఆనందం, ఆర్.వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరరావు, టీ.శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ మంగళగిరి యాదగిరి, పసుపుల శ్రీనివాస్, మెట్టుకాడి ప్రభాకర్ పాల్గొన్నారు.

దక్షిణమధ్య రైల్వే డీజీఎంగా కోట్ల ఉదయనాథ్



కోట్ల ఉదయనాథ్

సికింద్రాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా కోట్ల ఉదయనాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీసెస్ 2012 బ్యాచ్‌కు చెందిన ఉదయనాథ్ స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పూర్తి చేశారు. రైల్వేలో ఆర్థిక నిర్వహణ, అకౌంటెన్సీలో ఆయనకు అపారమైన అనుభవం ఉంది. ఈ నియామకానికి ముందు కోట్ల ఉదయనాథ్ సికింద్రాబాద్‌లోని దక్షిణమధ్య రైల్వే కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్‌లో డిప్యూటీ ఫైనాన్షియల్ అడ్వైజర్, చీఫ్ అకౌంట్స్ అధికారిగా పని చేశారు. గడిచిన పదేళ్ల సర్వీస్‌లో దక్షిణమధ్య రైల్వేలోని సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలో డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్‌గా, నాందేడ్ సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్‌గా కీలక పదవులు నిర్వహించారు.

మత్స్యకారుల వలకు భారీ చేప



మల్లేశ్వరం దగ్గర కృష్ణానదిలో చిక్కిన చేపను చూపిస్తున్న మత్స్యకార్మికురాలు

పెంట్లవెల్లి, జూలై 8 : నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల పరిధిలోని మల్లేశ్వరం గ్రామంలోని కృష్ణానదిలో సోమవారం మత్స్యకారులు వేసిన వలకు భారీ చేప చిక్కింది. ఉదయం చేపల వేటకు వెళ్లిన వెంకల్ గ్రామానికి చెందిన చాకలి మంగమ్మకు ఏకంగా 22కిలోల బొచ్చెరకం చేప వలలో పడడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో కృష్ణానదిలో నీరు పెరగడంతో భారీ చేపలు చిక్కడం తరచు జరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. లావు బొచ్చెరకం చేప పడడం వల్ల మార్కెట్‌లో మంచి ధర పలికిందని తెలిపారు.

25న జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

జడ్చర్ల, జూలై 8 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మీపై ఈ నెల 25న అవిశ్వాసంపై బలపరీక్ష నిర్వహించేందుకు కలెక్టర్ విజయేందిర బోయి ఉత్తర్వులు జారీ చేశారు. బలపరీక్షకు సంబంధించిన సమాచారాన్ని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో పాటు కౌన్సిలర్లుకు తెలియజేశారు. కౌన్సిల్ సమావేశానికి ఏర్పాట్లు చేయాలంటూ కమిషనర్ రాజయ్యకు ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 29న చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశాన్ని కౌన్సిలర్లు బహిష్కరించారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కౌన్సిలర్లు విజ్ఞప్తితో చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం సమావేశాన్ని నిర్వహించనున్నారు.

గొర్రెలపై చిరుతపులి దాడి?

- భయాందోళనలో గొర్రెల కాపరులు

పెద్దమందడి, జూలై 8: వనపర్తి జిల్లా పెద్దమందడి మండల పరిధిలోని పామిరెడ్డిపల్లి గ్రామ శివారులోని పెద్దగట్టు-పడాల గట్టు సమీపంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు గొర్రెల కాపరులు తెలిపారు. సోమవారం పామిరెడ్డిపల్లి గ్రామానికి పాలెం శ్రీశెలం, మల్లయ్య, యాదయ్య, శివయ్యలు తమ గొర్రెల మందను మేతకు తీసుకెళ్తున్న సమయంలో ఆకస్మాత్తుగా చిరుత పులి దాడి చేసి గొర్రెపిల్లను ఎత్తుకెళ్లినట్లు గొర్రెల కాపరులు తెలిపారు. చిరుత సంచారంపై అటవీ శాఖ దృష్టి పెట్టి బందించాలని కోరుతున్నారు. అదే విధంగా వారం రోజుల క్రితం జంగమయ్యపల్లి శివారులో అటవీ శాఖలో కూడా పక్షులపై చిరుత పులి దాడి చేసిందన్నారు. గుట్టల సమీపంలో ఉన్న రైతులు వ్యవసాయం చేయాలంటే భయాందోళనకు గురవుతున్నారు. పొలాలకు వెళ్లే రైతులకు, పశువులకు, గొర్రెలకు ప్రాణహాని ఉందని, వెంటనే అధికారులు స్పందించి బందించాలని మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, మాజీసర్పంచు సిద్దయ్య, శ్రీశైలం, భీంరెడ్డి కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గద్వాల, జూలై 8: గద్వాల మండల పరిధిలోని శెట్టి ఆత్మకూర్ గ్రామంలో ఆదివారం రాత్రి విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. దీనిని గేదె యజమాని ఆలూరు బీసన్న సోమవారం గుర్తించి పశుసంవర్ధకశాఖ అధికారులతో పాటు విద్యుత్‌అధికాలకు ఫిర్యాదు చేశాడు. డాక్టర్ శంకరయ్య దానిని పరిశీలించి నిర్ధారించారు. గేదె విలువ దాదాపు రూ.70వేలు ఉంటుందని ఆయన తెలిపారు.

108 వాహనంలో మహిళ ప్రసవం

ఉండవల్లి, జూలై 8: గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని ప్రాగటూర్ గ్రామానికి చెందిన పార్వతి అనే గర్భిణీకి ప్రసవ నొప్పులు రావడంతో 108 వాహనాన్ని ఆశ్రయించారు. ప్రాగటూర్ నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా తక్కశిల గ్రామ సమీపాన నొప్పులు తీవ్రం కావడంతో సకాలంలో ఈఎంటీ రాధా మోహన్, పైలట్ శ్రీశైలం స్పందించి మహిళకు డెలివరీ చేయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు ఈఎంటీ తెలిపారు. వైద్య పరీక్షల నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 108 వాహన సిబ్బందికి మహిళ భర్త రమేష్ ధన్యవాదాలు తెలిపారు.

పోలేపల్లిలో ఇసుక టిప్పర్ బోల్తా



పోలేపల్లిలో బోల్తా పడిన ఇసుక టిప్పర్

జడ్చర్ల, జూలై 8 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లిలోని టీఎస్ఐఐసీలోని ప్రధాన రహదారి పై సోమవారం తెల్లవారుజామున ఇసుక టిప్పర్ బోల్తా పడింది. టిప్పర్ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయని గ్రామస్థులు తెలిపారు. ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ఫిల్టర్ ఇసుకను తయారు చేసి, పోలేపల్లి మీదుగా హైదరాబాద్‌కు టిప్పర్‌లతో అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇసుక టిప్పర్‌లను అతివేగంగా నడుపుతారని, ఉదయం వేళల్లో పోలేపల్లి సెజ్‌లోని ఫార్మా పరిశ్రమలకు వచ్చే ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని, పలు పర్యాయాలు ప్రమాదాలు జరిగాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక టిప్పర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్, టిప్పర్ల పట్టివేత

రాజాపూర్, జూలై 8: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్, రెండు టిప్పర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కే.రవి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని కుచ్చర్‌కల్ గ్రామంలోని రోడ్డుపై సోమవారం ఉదయం అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గస్తీలో ఉన్న కానిస్టేబులు సుదర్శన్, రామకృష్ణారెడ్డి పట్టుకున్నారు. అంతకు ముందు మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామశివారు నుంచి రాయపల్లి గ్రామంలోని రోడ్డుపై తెల్లవారుజామున రెండు టిప్పర్లను పట్టుకున్నారు. డ్రైవర్లు నర్సిములు, పాండు, ట్రాక్టర్ డ్రైవరు పాత్లావత్ రాజేందర్‌లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

అలంపూర్ చౌరస్తా, జూలై 8: గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఉన్న వైన్ షాపు వద్ద జరిగిన ఘర్షణలో గాయపడిన వ్యక్తి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ నాయక్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కర్నూలు నగరంలోని అశోక్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ కృష్ణ ఈ నెల 6న తన మిత్రులు ఆది, వంశీ, బన్నిలతో కలిసి పుల్లూరు టోల్‌ప్లాజా వద్దకు మద్యం తాగేందుకు వచ్చారు. ఆది, వంశీ, బన్నిలు పక్కన మద్యం తాగుతున్న ధర్మ, మురళిలతో ఘర్షణ పడ్డారు. కృష్ణ విడిపించేందుకు యత్నించాడు. దాంతో ధర్మ అనే వ్యక్తి కృష్ణపై మద్యం సీసాతో దాడిచేయడంతో రక్తగాయలయ్యాయి. దీంతో మురళి అనే వ్యక్తి కర్నూలు ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం బాధితుడి తల్లి ఎరుకల శాంతమ్మ సోమవారం వచ్చి ఉండవల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు



కల్వకుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

కల్వకుర్తి, జూలై 8 : దళిత ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశు రాములు డిమాండ్ చేశారు. బాధ్యుడైన సీఐని తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించాలని పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలు అమలు చేసే స్థానంలో ఉన్న పోలీస్‌శాఖలో కుల వివక్ష వేధింపులు ఉండడం వల్లే దళిత ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఎస్ఐ ఆత్మహత్యకు కారకులైన సీఐ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ఈ సంఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని పరశురాములు పేర్కొ న్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు పులిజాల అశోక్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పు లిజాల అశోక్, కేవీపీఎస్ మండల కార్యదర్శి నారీమల్ల కుర్మయ్య, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు మిడ్జిల్ బాలయ్య, ప్రవీణ్‌కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక బాల్‌రెడ్డి, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చెన్నకేశవులు, నాయకులు మాధవ్, ఎం.కిరణ్‌కుమార్, సి.జంగయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

వంగూరు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్ఐ శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకులైన వారిపై వెంటనే పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పరుశరాములు, నాయకులు బాలస్వామి, అశోక్, నిరంజన్, మల్లేష్, చెన్నయ్య పాల్గొన్నారు.

'విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి'

కొల్లాపూర్, జూలై 8 : వర్షాకాలంలో వార్డు ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని వార్డులో నివాస గృహాలపై ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లను తొలగించి మెయిన్ రోడ్డు వెంట ఏర్పాటు చేయాలని 11వ వార్డు కౌన్సిలర్ బొరెల్లి కరుణమ్మ విద్యుత్ అధికారులకు కోరారు. సోమవారం మునిసిపల్ అధికారులు, విద్యుత్ శాఖ ఏఈ రాకేష్‌రెడ్డితో కలిసి కౌన్సిలర్ కరుణమ్మ వార్డులో పర్యటించారు. వార్డులో సింగిల్ ఫేస్ వైర్లు కిందికి వేలాడుతున్నాయని వాటిని సరిచేయాలని అధికారులను కోరారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో ప్రత్యేక నిధులు మంజూరు చేయించి వార్డు అభివృద్ధికి కృషి చేస్తామని సీసీ రోడ్డు, డ్రైనేజీలు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతామని బొరెల్లి కరుణమ్మ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బొరెల్లి మహేష్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

- ఆపరేషన్ ముస్కాన్ స్మైల్‌టీం ఎస్ఐ యాదయ్య

కల్వకుర్తిటౌన్, జూలై 8 : బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని ఆపరేషన్ ముస్కాన్ స్మైల్‌టీం ఎస్ఐ యాదయ్య అన్నారు. పట్టణంలోని పలు దుకాణాలు, హోటళ్లు, బట్టలషాపుల యజమానులకు అవగాహన కల్పించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండని వారిని పనిలో పెట్టుకోవద్దని హెచ్చరించారు. పట్టణంలోని ఓ బైక్‌మెకానిక్ షాపులో పని చేస్తున్న బాలుడిని గుర్తించి నాగర్‌కర్నూల్ చైల్డ్‌వేల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచినట్లు తెలిపారు. పాఠశాలలో ఉండే వయస్సులో పని ఉండకూడదని, ఇందుకు బాధ్యతగల ప్రతీ పౌరుడు కృషి చేయాలని అన్నారు. ఏఎస్ఐ నరసింహ, హెడ్‌కానిస్టేబుల్, పాండునాయక్, డీసీపీయూ యూనిట్ మధుబాబు, ఎస్టేట్ లేబర్ ఆఫీసు జూనియార్ అసిస్టెంట్ సప్తగిరి, కోనేరు సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌యాదవ్, చైల్డ్‌లైన్ ప్రతినిధి ప్రమీల, మహిళా హోంగార్డు అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి సాంకేతికవిద్యను అందించాలి

కల్వకుర్తిటౌన్, జూలై 8 : ప్రతీ విద్యార్థికి సాంకేతిక విద్యను అందించాలని రోటరీక్లబ్, హార్ట్‌ఫుల్‌నెస్ అసోషియేషన్ సభ్యులు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వబాలుర ఉన్నత పాఠశాలకు రూ. 4లక్షల విలువగల కంప్యూటర్లను అందజేసి వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కంప్యూటర్‌విద్యకోసం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని అన్నారు. విద్యార్థులు తమ తరగతిలో చెప్పేపాఠాలను వింటూనే కంప్యూటర్‌విద్యను అభ్యసించాలని సూచించారు. భవిష్యత్తులో కంప్యూటర్‌పై అభ్యసించే విద్యనే ఉంటుందని వివరించారు. పాఠశాల హెచ్‌ఎం బాలునాయక్, రోటరీక్లబ్ బాధ్యులు గిరిబాబుగౌడు, హార్ట్‌ఫుల్‌నెస్ అసోషియేసషన్ బాధ్యులు వేణు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ ప్రజావాణి సమావేశ మందిరంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి స్వయంగా కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజలు వివిధ శాఖల్లో సమస్యల పరిష్కారానికి మొత్తం 68 ఫిర్యాదులు అందాయని, వాటిని పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ కే.సీతారామారావు, సీపీవో భూపాల్‌రెడ్డి, ఏవో చంద్రశేఖర్‌లు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 14 ఫిర్యాదులు

జిల్లా కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే పోలీస్ ప్రజావాణికి 14ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్ తెలిపారు. తగు న్యాయం గురించి ఆరు, భూమి పంచాయతీలకు సంబంధించి ఆరు, భార్యాభర్తల గొడవలకు సంబంధించి రెండు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను త్వరితగతిన పరిష్క రించాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులకు ఆదేశించారు.

ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థుల ఇబ్బందులు



ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులను పర్యవేక్షిస్తున్న యువతి

అమ్రాబాద్, జూలై 8: అమ్రాబాద్ మండల పరిధిలోని కొత్తపల్లి ప్రభుత్వ ప్రా థమిక పాఠశాలలో ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈ పాఠశాలలో 40 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. సోమవారం ఉపాధ్యాయులు ఎవరూ విధులకు హాజరు కాకపోవడంతో తాత్కాలికంగా చదువుకున్న యువతిని పాఠశాలకు పంపించి విద్యార్థుల పర్యవేక్షణ కార్యక్రమాన్ని చేపట్టామని గ్రామస్థులు తెలిపారు. గత శుక్ర, శని వారాల్లో కూడా పాఠశాల పరిస్థితి ఈ విధంగానే ఉండడంతో గ్రామస్థులు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కూడా లేక పోవడంతో గ్రామస్థులు వారి ఇళ్ల నుంచే తీసు కెళ్లారు. ఈ విషయంపై మండల విద్యాధికారి బాలకిషన్‌ను విలేకరులు వివరణ కోరగా పాఠశాలలో ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులకు గాను ఒకరు శిక్షణ నిమిత్తం వెళ్లినట్లు తెలిపారు. మరొక ఉపాధ్యాయుడు అందుబాటులోనే ఉన్నాడని, మధ్యాహ్న భోజనం కూడా విద్యార్థులకు అందించినట్లు ఆయన తెలిపారు.

ఏకపక్షంగా వాటర్‌షెడ్ కమిటీ ఏర్పాటు

- బీజేపీ ఆధ్వర్యంలో మహిళల ధర్నా



బీజేపీ ఆధ్వర్యంలో అమ్రాబాద్‌లో ఆందోళన నిర్వహిస్తున్న మహిళలు, నాయకులు

అమ్రాబాద్, జూలై 8: అమ్రాబాద్ మండల పరిధిలోని బీకే తిరుమలాపూర్, ఉప్పునుంతల, లక్ష్మాపురం, లక్ష్మాపురంతండా గ్రామ పంచాయతీలకు వాటర్‌షెడ్ పథకం ద్వారా ప్రత్యేకంగా రూ. 86 లక్షలు నిధులు మంజూరైన విషయం విధితమే. ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో చెక్కును అందజేశారు. మహిళా సంఘాల జీవనోపాధుల కల్పన కోసం వచ్చిన నిధుల వినియోగం కోసం ఏర్పాటు చేయనున్న కమిటీలలో అధికార పార్టీ ఏకపక్షంగా తన వర్గీయులతో ఏర్పాటు చేసిందని ఆరోపిస్తూ సోమవారం అమ్రాబాద్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా, ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అన్ని వర్గాల మెజారిటీ ప్రజలు ఓటు వేశారని ఈ పథకాలను వర్తింప చేసేటప్పుడు అన్ని వర్గాల వారితో కమిటీలను ఏర్పాటు చేస్తే సమన్యాయం జరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ కమిటీలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రోడ్డును దిగ్బంధనం చేస్తామని వారు హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమాల దగ్గరికి పోలీసులు వచ్చి సంబంధిత ఏపీఎంకు ఫోన్ చేసి మాట్లాడారు. ఏపీఎం అందుబాటులో లేకపోవడంతో మండల మహిళా సమాఖ్య సీసీ శ్రీనివాసులు వచ్చి వారితో మాట్లాడారు. ప్రస్తుతం తాము ఎటువంటి కమిటీలను ఏర్పాటు చేయలేదని, అందరి సమక్షంలోనే కమిటీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజుతో పాటు ఆ పార్టీ నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాసులు, బీకే తిరుమలాపూర్, ఉప్పునుంతల తదితర గ్రామాలకు చెందిన నారమ్మ, గౌరమ్మ, పోచమ్మ, జయమ్మ తదతర మహిళలు హాజరయ్యారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

- మునిసిపల్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 8: మునిసిపాలిటీ పరిధిలోని ప్రజా, పారిశుధ్య సమస్యలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ చైర్ పర్సన్ కల్పన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మునిసిపాలిటీ అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మునిసిపాలిటీలో అధికంగా విద్యుత్, మురికి కాలువలు, చెత్తబండ్ల నిర్వహణపై ప్రజలు తమకు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి తమ వద్దకు తీసుకువస్తే పరిష్కరించేందుకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానన్నారు. మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆసుపత్రి పడకలను 300 నుంచి 600 పడకలకు పెంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, త్వరలో జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు పనులకు సంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. మునిసిపల్ వైస్ చైర్మన్ బాబురావు, కమిషనర్ నరేష్‌బాబు, టౌన్ ప్లానింగ్ ఏఈ ప్రశాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేషన్ ఆవిష్కరణలను వాట్సాప్ ద్వారా పంపాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



ఇంటింటా ఇన్నోవేషన్ ఆవిష్కరణ ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సమస్యలను పరిష్కరించే దిశగా ఇంటింటా ఇన్నోవేషన్ ఆవిష్కరణలను రూపొందించి వాట్సాప్ ద్వారా పంపాలని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఇంటింటా ఇన్నోవేషన్ ఆవిష్కరణ ప్రచార వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఔత్సాహికులు ఆవిష్కరణలలో తమ ప్రతిభను చాటుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అన్నారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా పలు ఆవిష్కరణల ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ఆవిష్కరణ, విద్యార్థుల ఆవిష్కరణ, వ్యవసాయ రంగ ఆవిష్కరణలు, సూక్ష్మచిన్న తరహా పరిశ్రమల ఆవిష్కరణలు, స్థానిక సమస్యలు పరిష్కరించే దిశగా తదితర అంశాల ఆవిష్కరణలను రూపొందించి ఆగస్టు 3వ తేదీ వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రదర్శన యొక్క ఆవిష్కరణపై రెండు నిమిషాల నిడివి గల వీడియో ఆవిష్కరణ, నాలుగు ఫొటోలు, 100పదాలతో ఆసక్తి గల ఔత్సాహికులు 9100678543నెంబర్‌కు వాట్సాప్ ద్వారా వృత్తి, ఊరి పేర్లు జిల్లా పేరుతో వివరాలను పంపించాలన్నారు. ఆవిష్కరణలు ఆగస్టు 3లోగా పంపాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్



జిల్లా కేంద్రంలోని సీడీపీవో కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 8: అంగన్‌వాడీ ఉద్యోగుల పాలిట శాపంగా మారిన జీవో నెంబరు 10ని వెంటనే రద్దు చేసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీడీపీవో కార్యాలయం ముందు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెకు తలొగ్గిన గత ప్రభుత్వం జీవో నెం.10 రద్దు చేసి టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.1 రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబరు 10నే కొనసాగిస్తూ సర్క్యులర్ జారీ చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆ జీవోను రద్దు చేసి రిటైర్మెంట్ బెనిఫిట్ పెంచి ప్రతీ నెల రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాసమ్మ, ఆయాలు సువర్ణ ల, రాధమ్మ, సీతమ్మ, సరోజమ్మ, అండాలమ్మ, పద్మ, లక్ష్మీ, బాలమ్మ, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు



కొల్లాపూర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య, కౌన్సిలర్లు

కొల్లాపూర్, జూలై 8 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కొల్లాపూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కొల్లాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో వైఎస్ఆర్ విగ్రహానికి మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య, కౌన్సిలర్లు షేక్.రహీంపాషా, ఎండి.నయీమ్‌లు పూల మాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి.ఎక్బాల్, కృష్ణమనాయుడు, మద్దెల రాందాస్, భాస్కర్‌గౌడ్, రమేష్‌ముదిరాజ్, బొరెల్లి మహేష్, ధర్మతేజ, మేకల కిరణ్‌యాదవ్, దిలీప్‌శెట్టి, ఎల్లగౌడ్, బాబా, శేఖర్, ముస్తాక్, రాము, శివ పాల్గొన్నారు.

● వ్యవసాయానికి పెద్దపీట

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో తెలంగాణ వ్యవసాయానికి పెద్దపీట వేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీవాణి విద్యా నిలయంలో ఇందిరాగాంధీ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ మహిళలకు, విద్యార్థులు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. న్యాయవాది మధుసూదన్‌రావు, జమీల్ అహ్మద్ ఖాన్, వెంకటస్వామి, రాజశేఖర్, సత్యం, జుబేర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట టౌన్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు సోమవారం పట్టణంలోని రాజీవ్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం నిత్యం శ్రమించిన నాయకుడు వైఎస్ఆర్ అని కొనియాడారు. ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందాలన్న లక్ష్యంతో ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టి అందరికి మెరుగైన వైద్యం అందేలా చేశారన్నారు. నాయకులు గౌరీశంకర్, రఘు, రామనాథం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● చారకొండ: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు.

వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అంజయ్య, చారకొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మయ్యగౌడ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు శివ, మండల మైనార్టీ అధ్యక్షుడు సత్తార్, జేసీబీ వెంకటయ్యగౌడ్, ఏలే సుదర్శన్, కుకుడాల శ్రీనివాసులు, ప్రశాంత్‌నాయక్, జరుపటి కొండల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాల వేసి, కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు మిద్దె రాములు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్, ఫీజ్ రీఅంబర్స్‌మెంట్ వంటి పథకాలను అమలు చేసి నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు వైఎస్సార్ అని కొనియాడారు. డీసీసీ ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమృత్ రెడ్డి, రాంచందర్, వెంకటస్వామి, గోవిందు రామకృష్ణ, ముక్తార్, మాజీ ఉప సర్పంచ్ బాలపీరు, దారెడ్డి హనుమంత్ రెడ్డి, జయకృష్ణ, కత్తె ఈశ్వర్, తిరుపతి రెడ్డి, ఖలీల్, రామకృష్ణ, శ్రీనివాస్ గౌడ్, అజీజ్, బొడ్డు అంజనేయులు, కదిరె రా ము, నసీర్, నక్క పర్వతాలు, భూపాల్, సామ మహేష్ తదితరులు ఉన్నారు.

● వెల్దండ: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని సోమవారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఎర్రశ్రీను, కృష్ణముదిరాజ్, హమీద్, నవీన్‌రెడ్డి, శ్రీనుయాదవ్, రమేష్ ఉన్నారు.

వైఎస్ఆర్ ఆశయాలను కొనసాగిద్దాం

● కల్వకుర్తి : దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రడ్డి ఆశయాలను కొనసాగిద్దామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బ్యాంగి ఆనంద్‌కుమార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి కార్యక్రమాన్ని కల్వకుర్తి పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సమీపంలో విగ్రహానికి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బొమ్మ అంజనేయులు, జమ్ముల శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, పి.శేఖర్, సురేందర్‌రెడ్డి, సంతు యాదవ్, నాని, సురేష్, కౌన్సిలర్ ఏజాస్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి



ఆర్డీవో శ్రీనుకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడు, బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు గణేష్, నిరుద్యోగులు

కల్వకుర్తిటౌన్, జూలై 8 : నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు గణేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడు అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టి ఆర్డీవో శ్రీనుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం 100రోజుల్లో రెండులక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పినవిధంగా వెంటనే భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతిని ప్రకటించాలని, డీఎస్సీ 11వేలతో కాకుండా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించాలని కోరారు. ప్రస్తుతం డీఎస్సీకి చదువుతున్న వారికి ఇప్పుడు ప్రకటించిన తేదీల్లో కాకుండా రెండునెలలు ముందుకు జరిపి తేదీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో ఉన్న 2000బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీచేయాలని ఆర్డీవోకు వినతి ప్రతం అందజేశారు. బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు నాగరాజు, నిరుద్యోగులు కృష్ణ, రాజునాయక్, పాండు, శ్రీవాణి, మానస, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకోవడం బీఆర్ఎస్ పార్టీ లక్ష్యం

బల్మూరు, జూలై 7 : బీఆర్ఎస్ పార్టీలో పని చేసిన కార్యకర్తలకు అండగా ఉంటామని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మండల పరిధిలోని కొండనాగుల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు దివంగత ఉడుతునూరి నరసింహ అనే వ్యక్తి గత రెండు నెలల క్రితం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో ఆయన కుటుంబానికి పార్టీ తరఫున మంజూరైన రూ.2 లక్షల చెక్కును సోమవారం హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అందజేశారు. బల్మూరు మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ చింత చందు, జీబీఆర్ యువసేన మండల అధ్యక్షుడు సుల్తాన్, నిరంజన్, సుధాకర్ గౌడ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై గ్రామసభ

ఉప్పునుంతల, జూలై 8: మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో సోషల్ ఆడిట్ గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రూ.36 లక్షల 22 వేల 299 నిధులకు ఆడిట్ నిర్వహించి సోమవారం గ్రామసభలో డీఆర్‌పీ అశోక్ వివరాలను వెల్లడించారు. ఎలాంటి అవినీతికి చోటు లేకపోవడంతో గ్రామసభ సజావుగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్, టీఏ సింగోటం, ఫీల్డ్‌అసిస్టెంట్ దేవేందర్, అంగన్‌వాడీ టీచర్లు రజిత, వేదవతి, నాయకులు లింగమయ్య, వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నాగార్జున, బాల్‌రాజు, శ్రీశైలం, మల్లేష్, మహేష్, బాలస్వామి, జంగయ్యతదితరులు ఉన్నారు.

ప్రజావాణికి విధిగా హాజరుకావాలి

చారకొండ, జూలై 8: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మండలంలోని ఆయా శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని తహసీల్దార్ కేసీ ప్రమీల అన్నారు. మండంలోని తిమ్మాయిపల్లికి చెందిన కొండ్రెడ్డి లక్ష్మయ్య తన తండ్రి పెంటయ్య పేరుమీద ఉన్న లావాని భూమిని విరాసత్ కోసం ప్రజావాణిలో దరఖాసస్తు చేసుకున్నారని ప్రజావాణికి ఒక్క దరఖాస్తు మాత్రమే వచ్చిందని తహసీల్దార్ కేసీ ప్రమీల తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి తహసీల్దార్ కేసీ ప్రమీల తప్ప ఏ అధికారి కూడా హాజరు కాలేదు.

లబ్ధిదారులు అర్హులుగా నమోదు చేసుకోవాలి

చారకొండ, జూలై 8: ప్రజాపాలనలో ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చెసుకొని 200ల యూనిట్ల ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ పథకాలకు అర్హులుగా ఎంపిక కాని లబ్ధిదారులు మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో అర్హులుగా నమోదు చేసుకోవాలని ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ 200ల యూనిట్ల ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ కోసం లబ్ధిదారులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రశీదుతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, విద్యుత్‌బిల్లు, గ్యాస్ సిలిండర్ రశీదుల జిరాక్స్‌లను తప్పనిసరిగా వెంట తెచ్చుకొంటే వాటితో ఆన్‌లైన్‌లో సరి చేస్తామని అన్నారు. పంచాయతీ కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఎప్‌సెట్ ధ్రువపత్రాల పరిశీలన

బిజినేపల్లి, జూలై 8: మండలంలోని పాలెంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల్లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎప్‌సెట్ ధ్రువప త్రాల పరిశీలన సోమవారం ముగిసినట్లు ఎప్‌సెట్ జిల్లా కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యారాణి తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుకింగ్ చేసుకున్న 877 మంది విద్యార్థులకు గాను 864 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైనట్లు పేర్కొన్నారు. మొదటి రోజు 305 మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోగా 303 మంది హాజరయ్యారు. రెండోవ రోజు 302 మంది స్లాట్ బుక్ చేసుకొని 293 మంది, మూడవ రోజు 270 మంది స్లాట్ బుక్ చేసుకొని 268 మంది హాజరవ్వగా, 13 మంది గైర్హజరయ్యారని ఆమె తెలిపారు.

వీల్‌చైర్లు పంపిణీ

చారకొండ, జూలై 8: మండల పరిధిలోని జూపల్లిలో సత్య హరిశ్చంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. అంకిళ్ల రామస్వామి, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి స్థల పరిశీలన

చారకొండ, జూలై 8: మండల కేంద్రంలో వన మహోత్సవానికి సోమవారం ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవ స్థలంలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు అనువుగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వన మహోత్సవ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శి గణేష్‌కు సూచించారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించిన ఉపాధ్యాయులు

కల్వకుర్తి, జూలై 8 : కల్వకుర్తి మండలం తాండ్రా పీఎస్‌లో ఉపాధ్యాయులుగా పని చేసి పదోన్నతిలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సన్మానించారు. తోటపల్లి హైస్కూల్‌కు స్కూల్ అసిస్టెంట్‌గా వెళ్తున్న ఉపాధ్యాయుడు వి.జంగయ్యను, పాఠశాలలకు బదిలీపై వెళ్తున్న రామకృష్ణ, శివకుమార్, పావనిలను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తెలకపల్లి: ఇటీవల పదోన్నతి పొంది బదిలీ అయిన ఉపాధ్యాయులకు సోమవారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వీడ్కోలు, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగత కార్యక్రమం, ప్రధాన ఉపాధ్యాయులు పాపిశెట్టి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. పదోన్నతి పొందిన బాలస్వామి, బుచ్చిబాబు, బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్‌రెడ్డి, యాదవ రెడ్డి, పద్మావతి, జ్యోతి, ప్రభాకర్లను సన్మానించారు.

గొర్రెలు, మేకల సంత వేలం వాయిదా

చారకొండ, జూలై 8: మండల కేంద్రంలో ప్రతీ శనివారం జరిగే గొర్రెలు, మేకల సంత వేలం మంగళవారం జరగాల్సి ఉండటంతో అనుకోని కారణాల వల్ల వాయిదా వేసినట్లు చారకొండ గ్రామ ప్రత్యేక అధికారి ఇసాక్ హుసేన్, పంచాయతీ కార్యదర్శి గణేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈనెల 11న బహిరంగా వేలం నిర్వహిస్తునట్లు వారు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే గమనించాలని కోరారు.

కుల వృత్తుల వారికి ప్రభుత్వం న్యాయం చేయాలి

పెద్దకొత్తపల్లి, జూలై 8 : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుల వృత్తుల వారికి న్యాయం చేయాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దాపురం సాలీశ్వరం సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రజక వృత్తిదారులు అనేక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.